హస్తం విజయభేరి..

- తెలంగాణలో తొలిసారి అధికార పీఠంపై కాంగ్రెస్
- అపోహలు, అనుమానాలు పటాపంచలు
- రాహుల్ అండగా అసంతృప్తులు.. ఆందోళనలను అధిగమించి ఐక్యతారాగం
- క్యాడర్ నుంచి లీడర్ వరకూ ఇదే సూత్రం
- రేవంత్ ఎదురుదాడి వ్యూహం
- ఆరు గ్యారెంటీలతో సక్సెస్ మంత్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ లాంటి ఛరిష్మాగల బలమైన నాయకుడు అధికార పార్టీకి అధ్యక్షుడిగా ఉండటం.. పదేళ్ల నుంచి ప్రభుత్వానికి ఆయన రథసారధిగా ఉండటం, అభివృద్ధి, సంక్షేమం పథకాలతోపాటు ఆత్మగౌరవమనే నినాదంతో బిఆర్ఎస్ మూకుమ్మడి దాడి చేయటం, అన్నింటికీ మించి కెసిఆర్ వాగ్దాటి.. హరీశ్ మంత్రాంగం.. కెటిఆర్ సమన్వయంతో పటిష్టంగా ఉన్న బిఆర్ఎస్‌ను ప్రతిపక్ష కాంగ్రెస్ ఢీ కొట్టగలదా..? ఇది ఎన్నికల ముందు వరకూ సగటు తెలంగాణ పౌరుడి మెదడులో మెదిలిన ప్రశ్న. కానీ ఇలాంటి ప్రశ్నలు, అపోహలు, అనుమానాలను పటాపంచలు చేస్తూ కాంగ్రెస్ కొద్ది కాలంలోనే రేసులోకి వచ్చింది. రాష్ట్రంలో రాహుల్ జోడో యాత్రతో మొదలైన ఈ రేసు... అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత మరింత స్పీడందుకుంది. అగ్రనేతలు రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డికె శివకుమార్ తదితరుల ప్రచారంతో 'వార్ వన్‌సైడ్' కాదని తేల్చి చెప్పింది. ఇప్పుడు గెలిచి చూపించింది.

రాష్ట్రంలో అంతర్గత కుమ్ములాటలు, బలహీనతలతో కకా వికలమైన కాంగ్రెస్... కర్ణాటక ఫలితాలతో శరవేగంగా పుంజుకుంది. పదేళ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న నేపథ్యంలో 'చావో రేవో' తేల్చుకోవాల్సిన పరిస్థితి ఇటు నేతల్లోనూ, అటు క్యాడర్‌లోనూ నెలకొంది. దీంతో 'కాంగ్రెసోళ్లను గెలిపిస్తే... వాళ్లు ఆ పార్టీలో ఉండరు.. వాళ్లకు వాళ్లే ఓడించుకుంటారు.. కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి అభ్యర్థే...'అనే అవహేళనలను, అనుమానాలను తట్టుకుని, లీడర్లందరూ విబేధాలను తాత్కాలికంగా పక్కనబెట్టి...ఐక్యతా రాగాన్ని ఆలపించారు. ఇదే సమయంలో ఇక్కడి పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వచ్చిన ఆ పార్టీ అధిష్టానం... ప్రతీ నిమిషం దిశా నిర్దేశం చేస్తూ నేతలు గాడి తప్పకుండా చూసుకోగలిగింది. దీనికితోడు రాహుల్, ఖర్గేల పర్యవేక్షణ, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ చేసిన వ్యూహరచన కాంగ్రెస్‌కు మరింత బలాన్నిచ్చింది.

ఢీ అంటే ఢీ...

మాటల మాంత్రికుడు సిఎం కెసిఆర్‌పై ఎదురుదాడి చేయడం ఏ నాయకుడికైనా అంత ఈజీ కాదు. కానీ ఒక విధంగా పిసిసి చీఫ్ రేవంత్... ఆ లోటును భర్తీ చేశారనే చెప్పొచ్చు. ప్రస్తుత కాంగ్రెస్ విజయంలో ఆయన 'మాటల దాడి' పాత్ర ఎంతో ఉందని చెప్పక తప్పదు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు చేసిన విమర్శలకు ప్రతి విమర్శలు చేస్తూ, సవాళ్లకు ప్రతి సవాళ్లు విసురుతూ రేవంత్ ఢీ అంటే ఢీ అనే రీతిలో వ్యవహరించారు. ఇదే సమయంలో కాంగ్రెస్‌లో జోష్ నింపేందుకు, సిఎం దృష్టిని మరల్చేందుకు ఆయన కామారెడ్డి నుంచి సిఎం కెసిఆర్‌పై పోటీ చేశారు. తద్వారా యావత్ రాష్ట్రం దృష్టిని ఆకర్షించారు. బిఆర్ఎస్‌కు, బిజెపికి పదుల సంఖ్యలో స్టార్ క్యాంపెయినర్లు ఉండగా... కాంగ్రెస్‌కు మాత్రం తానొక్కడే అయి... ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్న రేవంత్... హెలికాప్టర్‌లో సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రచారాన్ని హోరెత్తించారు.

అన్నింటిలోనూ అదే జాగ్రత్త...

మరోవైపు టికెట్ల కేటాయింపులోనూ కాంగ్రెస్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించింది. సీనియర్ నేతలు, సిట్టింగులు, ఆశావహుల పేర్లను అనేక దఫాలుగా వడబోసిన ఆ పార్టీ అధిష్టానం... ఆ తర్వాతే తుది జాబితాను ప్రకటించింది. టికెట్ల కేటాయింపునకు సంబంధించి ఎక్కడా ఎలాంటి అసంతృప్తులకు తావు లేకుండా చూసుకోవటంలో ఆ పార్టీ సక్సెస్ అయింది. అసంతృప్తులు, రెబల్స్‌ను బుజ్జగించటంలోనూ, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోకుండా చూసుకోవటంలో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించి, అందులో విజయం సాధించింది. బిఆర్ఎస్, బిజెపిల్లో సీనియర్లుగా ఉండి, అసంతృప్తితో రగిలిపోతున్న నేతలతో మంతనాలు జరిపి, వారిని తన వైపునకు తిప్పుకోవటంలో హస్తం పార్టీ సఫలీకృతమైంది.

'ఆరింటి'తో కొట్టి.. గెలుపుబాట పట్టి...

కన్నడనాట ఐదు గ్యారెంటీలతో ప్రజల నాడిని పట్టిన కాంగ్రెస్.. మన రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో ప్రజామోదం పొందింది. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే వంటగ్యాస్, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా, కౌలు రైతులు, భూమి లేని నిరుపేదలకు రూ.12 వేలు, రూ. రెండు లక్షల రుణమాఫీ తదితర కాంగ్రెస్ వాగ్దానాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీ యువతను ఆకర్షించింది. వెరసి ఇవన్నీ కాంగ్రెస్ గెలుపుబాటకు కారణమయ్యాయి.

అహంకారపూరిత పాలనకు చరమగీతం

- సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏకైక జనరల్ నియోజకవర్గమైన కొత్తగూడెంలో కాంగ్రెస్ బల పరిచిన సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు ఘన విజయం సాధించారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకటరావుపై 26,214 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలనకు ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెప్పారని తెలిపారు. గెలిచిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమ పార్టీ పేరుతో అధికారంలోకి వచ్చిన కెసిఆర్ పదేళ్లుగా ఉద్యమాలను అణిచివేసి నియంత పాలన కొనసాగించారన్నారు. అణచివేత ధోరణిని క్షమించరని తెలిపారు. అందుకు నిదర్శనం శాసనసభ ఎన్నికల ఫలితాలే నిరూపించాయని చెప్పారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అప్రజాస్వామిక విధానాలపై ప్రజలిచ్చిన తీర్పు

- సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ అహంకారం, అవినీతి, అప్రజాస్వామిక విధానాలపై ప్రజలిచ్చిన తీర్పు అని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. పాలకులకు ఇది కనువిప్పుగా ఉండాలని భావిస్తున్నామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కడం, అంతులేని అహంకారం, దురహంకారంతో అప్రజాస్వామిక విధానాలను అనుసరించడం, నిరంకుశ, అవినీతి విధానాలు, నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల బిఆర్ఎస్ పరాజయం పాలైందని తెలిపారు. స్వయంగా కెసిఆర్‌నే ఒకచోట ఓడించడం ప్రజల్లో తీవ్రంగా ఏర్పడిన నిరసనకు నిదర్శనమని పేర్కొన్నారు. బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎంల మ్యాచ్ ఫిక్సింగ్ వల్ల హైదరాబాద్‌లో భయం, భ్రమలు కల్పించడం వల్ల ఆ మాత్రం సీట్లలో ఆయా పార్టీలు గెలిచాయని వివరించారు. ఈ కూటమి ప్రజావ్యతిరేకంగా రానున్న కాలంలో ఉంటుందని గమనించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపును మతోన్మాద, ఫాసిస్టు కూటమిపై ప్రజలు, ప్రజాస్వామిక గెలుపుగా భావిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామికంగా, లౌకికత్వంతో సమస్యలను పరిష్కరించే విధంగా వ్యవహరించాలని కోరారు.

నారాయణ పేట, సత్తుపల్లిలో గడ్డపై తొలి మహిళా ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నారాయణపేట నియోజకవర్గంలో తొలి మహిళా ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి(30) విజయం సాధించారు. నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడిన నేపథ్యంలో.. టిఆర్ఎస్ అభ్యర్థి ఎస్. రాజేందర్ రెడ్డిపై 7950 ఓట్ల మెజారిటీతో ఆమె గెలుపొందారు. ఫలితాల అనంతరం భావోద్వేగానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. నారాయణపేటకు చెందిన మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి మనవరాలు, స్వర్గీయ చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మిల కుమార్తె ఈ చిట్టెం పర్ణికా రెడ్డి. చిట్టెం లక్ష్మి.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆమెకు భర్త డాక్టర్ విశ్వజిత్ రెడ్డి, కుమారుడు అయన్స్ రెడ్డి(4) ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాదాపు 20 ఏళ్ల పాటు తన మేనమామ, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలతోనే నేడు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. తనను నియోజకవర్గంలో తొలి మహిళా ఎమ్మెల్యేగా గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా, నియోజకవర్గంలో 1,81,708 ఓట్లు పోలవ్వగా.. కాంగ్రెస్ పార్టీకి 84,005 ఓట్లు, బిఆర్ఎస్ అభ్యర్థి ఎస్. రాజేందర్ రెడ్డికి 76,499 ఓట్లు పోలయ్యాయి. కాగా, కాంగ్రెస్ పార్టీ గెలుపుతో కార్యకర్తలు ఆనందంతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ముఖ్య కూడళ్లలో బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేస్తూ ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు.ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం చరిత్రలో తొలిసారిగా మహిళా అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయికి కాంగ్రెస్ అవకాశం ఇవ్వగా ఘనవిజయం సాధించారు. బిఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై 20వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ప్రజలు మార్పు కోరుకున్నారు

- జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకున్నారని, అందువల్లే కాంగ్రెస్ పార్టీకి అధిక సీట్లు వచ్చాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్ పదేళ్ల కాలంలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. అహంకారంతో నిర్ణయాలు తీసుకున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం అహంకారంతో వ్యవహరించారని చెప్పారు. దాని వల్ల ప్రభుత్వం, పాలకులపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. కెసిఆర్‌పై తీవ్ర అసంతృప్తి కారణంగా బిఆర్ఎస్ పార్టీ ఓడిపోయిందన్నారు. ముఖ్యంగా యువకులు, మహిళలు, కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోవడం వల్ల నిరుద్యోగులు అందరూ కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను కేవలం రెండు కూటమిలుగానే చూశారని, ప్రత్యేకంగా ఉన్న మూడో కూటమిని చూడలేదని చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని, భవిష్యత్‌లో సిపిఎం నిర్మాణానికి కృషి చేస్తామని ప్రకటించారు.

అసెంబ్లీలోకి మహిళా ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీలో ఈ సారి మహిళల సంఖ్య కాస్త పెరిగింది. గత ఎన్నికల్లో ఆరుగురు మహిళా అభ్యర్థులు విజయం సాధించగా ఈ పర్యాయం వారి సంఖ్య తొమ్మిదికి చేరింది. తాజా ఎన్నికల్లో భారీసంఖ్యలో మహిళలు పోటీ చేశారు. అయితే గెలిచింది మాత్రం తొమ్మిది మందే. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సైతం అనేకమంది ఎన్నికల గోదాలోకి దిగారు. వీరిలో ఎక్కువ మంది ఓటమి పాలుకావడం గమనార్హం. కొందరు జనరల్ స్థానాల్లో పోటీచేయగా, మరికొందరు ఎస్‌సి, ఎస్‌టి రిజర్వుడు నియోజకవర్గాల నుంచి బరిలో ఉన్నారు. వీరిలో మహేశ్వరం నుంచి విద్యాశాఖ మంత్రి పిసబితాఇంద్రారెడ్డి మరోసారి గెలుపొందా రు. ఆమె ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిపై భారీ మెజారిటీతో విజయం సాధించారు. వైఎస్ఆర్ హయాంలో మాజీ మంత్రి ఇంద్రారెడ్డి భార్యగా బరిలోకి దిగిన సబిత, గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచి బిఆర్ఎస్‌లోకి వెళ్లిన విషయం విదితమే. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన మామిడాల యశస్విని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఓడించారు. యశస్విని తొలిసారి ఎన్నికల్లో పోటీచేశారు. ఇది రాష్ట్రంలో సంచలనంగా మారింది. టిడిపి నుంచి బిఆర్ఎస్ లో చేరిన దయాకర్‌రావును ఓడించేందుకు యశస్విని తరపున టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి భారీ గా ప్రచారం చేశారు. కంటోన్మెంట్ (ఎస్‌సి) స్థానం నుంచి దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత, గద్దరు కుమార్తె డాక్టర్ జీవి వెన్నెలపై గెలుపొందారు. ములుగు నుంచి ధనసరి అనసూయ (సీతక్క) మూడో సారి గెలిచి హాట్రిక్ సాధించారు. ఆమెకు కాంగ్రెస్ మంత్రివర్గంలో మహిళల కోటాలో ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారనే ప్రచారం గాంధీభవన్‌లో జరుగుతున్నది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి నర్సాపూర్ నుంచి మరోసారి విజయం సాధించారు. గత ఎన్నికలో ఓడిపోయిన కోవ లక్ష్మి ఈసారి తన సత్తా చాటి బిఆర్ఎస్ తరపున గెలిచారు. మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. కోదాడ నుంచి ఎన్ పద్మావతి మళ్లీ అసెంబ్లీకి రానున్నారు.

గత ఎన్నికల్లో ఓడిన సంగతి తెలిసిందే. అలాగే సత్తుపల్లి (ఎస్‌సి) మట్టా రాగమయి మాజీ టిడిపి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యను ఓడించి సంచలనం సృష్టించింది. ఇకపోతే పోటీచేసి ఓడిపోయిన ప్రముఖుల్లో ఖైరతాబాద్ నుంచి పిజెఆర్ కుమార్తె విజయారెడ్డి, మెదక్ నుంచి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, గోషామహల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న సునీతారావు, చొప్పదండి నుంచి బిజెపి తరపున బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బాల్కొండ నుంచి మంత్రి ప్రశాంత్ రెడ్డిపై పోటీచేసిన ఆయన మేనత్త అన్నపూర్ణమ్మ, ఇల్లెందు (ఎస్‌సి) నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, కెటిఆర్‌పై బిజెపి నుంచి పోటీచేసిన జర్నలిస్టు రాణిరుద్రమరెడ్డి, హుజుర్‌నగర్ నుంచి సిపిఎం తరపున పోటీచేసిన మల్లు లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఉన్నారు. ఇకపోతే కొల్లాపూర్ నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా రంగంలో ఉన్న కర్నె శిరీష (బర్రెలక్క) విజయం సాధించడంలో విఫలమయ్యారు.

నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం..

- ప్రతిపక్ష పార్టీగా సమర్థంగా వ్యవహరిస్తాం: కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తామని, శాసన సభలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాతీర్పును శిరసావహిస్తూ కెసిఆర్ సిఎం పదవికి రాజీనామా చేసినట్టు చెప్పారు. పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేసినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదన్నారు. 119 స్థానాలకు గాను ప్రజలు 39 స్థానాలు ఇచ్చి ప్రతిపక్ష పాత్ర పోషించమని ఆదేశించారని చెప్పారు. ఓటమిని గుణపాఠంగా తీసుకుని.. పాఠాలు నేర్చుకుంటామన్నారు. 23 ఏళ్లలో ఎన్నో ఎదురు దెబ్బలు తగిలాయని గుర్తు చేశారు. ప్రజల దయతో రెండు పర్యాయాలు అధికారం చేపట్టామన్నారు. అదివారం నాటి ఫలితాలు కొంత నిరాశపర్చినా బాధలేదన్నారు. రాజకీయాల్లో ఇవన్నీ సహజమని తెలిపారు. నాయకులు, కార్యకర్తల కృషి, పోరాట ఫలితంగానే బిఆర్ఎస్ 39 సీట్లు గెలుచుకుందన్నారు. ప్రతిపక్ష పాత్రలోనూ అలవోకగా ఇమిడిపోతామని తెలిపారు. ప్రజల పక్షాన, ప్రజల గొంతుకగా పనిచేస్తామని చెప్పారు. మా పార్టీ శ్రేణులతో పాటు అడుగడుగునా అండగా నిలబడిన, సహకరిం చిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత చాలా అవసరమన్నారు. గెలుపైనా, ఓటమైనా ఒకేరకం గా తీసుకోవాలని కెసిఆర్ నేర్పించారని గుర్తుచేశారు. గతంలో కంటే రెట్టింపుగా కష్టపడతామన్నారు. కార్యకర్తలు ఎవరూ నిరాశపడొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నడపాలని కెటిఆర్ కోరారు.

ఇది ప్రజల తిరుగుబాటు

- ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి ఉండకపోతే ఎలా ఉంటుందో ప్రజలు తీర్పు ఇచ్చారని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం వ్యాఖ్యానించారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్కు వద్ద తెలంగాణ అమరులకు ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పాలకులైనా సరే... ప్రజాస్వామిక విలువలను పాటించాల్సిందేననీ, లేకుంటే ఫలితాలు ఇదే విధంగా ఉంటాయని తెలిపారు.తొమ్మిదన్నే ండ్ల పీడన అనుభవించిన ప్రజలు నిరసన తెలపకుండా, సమావేశాలు పెట్టుకోకుండా నిరంకుశంగా వ్యవహరించారని తెలిపారు. నిరుద్యోగులు, రైతులు, సింగరేణి, ఆర్‌టిసి కార్మికులు, నిర్వాసితులు, పోడు భూములు ఇలా అనేక సమస్యలను ఆ నిర్బంధాల మధ్య వెలుగు లోకి తెచ్చినట్టు తెలిపారు. ప్రజల చైతన్యం తగ్గలేదనీ, సమయం రాగానే కనబరిచారన్నా రు. సిఎం కెసిఆర్‌ను ఒకసారి దించకపోతే అహంభావం పెరిగిపోతుందని పసిగట్టారని తెలిపారు. కార్యక్రమంలో టిజెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 46/2023

Between:-
షేక్ అబ్దుల్‌రహీం .... వాది
మురియు
శ్రీమతి మామిడిపాక వెంకట సులోచన వగైరాలు ....ప్రతివాదులు

To
D3) మామిడిపాక అశోక్ కుమార్ S/o లేటు చెంచుసుబ్బారావు R/o నాగులపాలెం, బాపట్ల జిల్లా. ప్రస్తుత నివాసము :- హైదరాబాద్ సిటీ, తెలంగాణా రాష్ట్రం

పైనంబరు గల దావాను మీపై దాఖలుచేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది.11-12-2023న ఉ.10-30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది.లేనియెడల మీ పరోక్షమునందు దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //
వాయిదా తేదీ: 11-12-2023

ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH. శ్రీరమణి
న్యాయవాదులు, పర్చూరు.

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 39/2023

Between:-
షేక్ అబ్దుల్‌రహీం ....వాది
మురియు
శ్రీమతి మామిడిపాక వెంకట సులోచన వగైరాలు .....ప్రతివాదులు

To
D3) మామిడిపాక అశోక్‌కుమార్ S/o లేటు చెంచుసుబ్బారావు R/o నాగులపాలెం, బాపట్ల జిల్లా. ప్రస్తుత నివాసము :- హైదరాబాద్ సిటీ, తెలంగాణా రాష్ట్రం

పై నంబరు గల దావాను మీపై దాఖలుచేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది.21-12-2023 న ఉ.10-30ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసినది. లేనియెడల మీ పరోక్షమునందు దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //
వాయిదా తేదీ: 21-12-2023

ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH. శ్రీరమణి
న్యాయవాదులు, పర్చూరు.

IA నోటీసు

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA No: 149/2023
in
OS No :39/2023

Between:-
షేక్ అబ్దుల్ రహీం ....పిటీషనరు
మురియు
శ్రీమతి మామిడిపాక వెంకట సులోచన వగైరాలు ..... రెస్పాండెంట్స్

To
R3) మామిడిపాక అశోక్‌కుమార్ S/o లేటు చెంచుసుబ్బారావు R/o నాగులపాలెం, బాపట్ల జిల్లా. ప్రస్తుత నివాసము :- హైదరాబాద్ సిటీ, తెలంగాణా రాష్ట్రం

పై నంబరు గల పిటీషను మీపై దాఖలుచేసి మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది.21-12-2023న ఉ.10-30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమునందు పిటీషను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //
వాయిదా తేదీ: 21-12-2023

ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH. శ్రీరమణి
న్యాయవాదులు, పర్చూరు.

పాత పెన్షన్‌కే ఉద్యోగుల మద్దతు

- కాంగ్రెస్‌కు ప్రభుత్వానికి శుభాకాంక్షలు
- టిఎస్‌సిపిఎస్‌ఇయు అధ్యక్షులు స్థితప్రజ్ఞ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడుతున్న ప్రభుత్వా నికి తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పాత పెన్షన్ అమలు కోసం సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు పలికారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) రద్దు చేయాలనీ, పాత పెన్షన్ అమలు చేయాలని టిఎస్‌సిపిఎస్‌ఇయు ఆధ్వర్యంలో ఎన్నో పోరాటా లు, ఆందోళనలు చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే సిపిఎస్ రద్దు చేస్తామనీ, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, హిమాచల్ ప్రదేశ్‌లో పాత పెన్షన్‌ను అమలు చేసిన విధంగా తెలంగాణలో కూడా అమలు చేస్తా మంటూ ఆ పార్టీ పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అందు కుగాను ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో సిపిఎస్ యూనియన్ చేపట్టిన ఉద్యమం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లతోపాటు కుటుంబ సభ్యుల ఓట్లు కూడా దాదాపు కాంగ్రెస్‌వైపే మొగ్గు చూపాయని వివ రించారు. ప్రతి నియోజకవర్గం లో పోస్టర్ బ్యాలెట్ ఓట్లు 90 శాతానికి పైగా కాంగ్రెస్‌కు పడ్డాయని తెలిపారు. రాష్ట్రంలోని 2.10 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యా యులు ఆందోళనతో చెందుతు న్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా పాత పెన్షన్‌ను అమలు చేస్తుందన్న నమ్మకముందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు మంచి భవిష్యత్తు ఉండాలి : టిఇఎ

మంచి మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ పార్టీకి, పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఎంప్లా యీస్ అసోసియేషన్ (టిఇఎ) అధ్యక్షులు చిలగాని సంపత్ కుమారస్వామి, సెక్రెటరీ జనరల్ జి నిర్మల శు భాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా స్వామ్యం పరిఢవిల్లాలనీ, ఉద్యోల గులు, ప్రజలకు మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు : సిపిఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

రాష్ట్రంలో ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వానికి సిపిఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు శుభాకాంక్షలు తెలిపారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిం చాలని కోరారు. వేతనాలు, డిఎలు, జిపిఎఫ్, మెడికల్ బిల్లులు, టిఎస్‌జిఎల్ఐ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల విజయం : టిఎస్‌పిటిఎ

ఇది ముమ్మాటికీ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లు, పీడిత ప్రజలు సాధించిన విజయమని టిఎస్‌పిటిఎ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ తెలిపారు. ఉద్యోగ వ్యతిరేక విధానాల పై ప్రజా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

ఆరుగురు మంత్రులు ఇంటికి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బొల్తా పడి అధికార పార్టీకి నిరాశ ఎదురైంది. ప్రత్యర్థి కాంగ్రెస్‌కు గెలుపు దక్కింది. కాంగ్రెస్ తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతోంది. గత ఎన్నికల్లో 88 నియోజకవర్గాల్లో విజయం సాధించిన బిఆర్ఎస్ ఈసారి 39 స్థానాలకే పరిమితమైంది. సిఎం కెసిఆర్‌తోపాటు పలువురు మంత్రులకూ పరాభవం తప్పలేదు. కొందరు మంత్రులు విజయం సాధించినా, గతంలోని మెజారిటీ మాత్రం దక్కకపోవడం గమనార్హం.

తాజా ఎన్నికల్లో గజ్వేల్‌తోపాటు కామారెడ్డి నియోజకవర్గం కెసిఆర్ పోటీ చేశారు. గజ్వేల్‌లో మరోసారి గెలవగా, కామారెడ్డిలో రెండో స్థానానికి పరిమితమయ్యారు. కెసిఆర్‌ను పక్కనబెడితే మొత్తం 17 మంది మంత్రులకు టికెట్లు దక్కాయి. ఈసారి ఎన్నికల్లో ఆరుగురు మంత్రులకు షాక్ తగిలింది. నిర్మల్ నుంచి బరిలోకి దిగిన ఇంద్రకరణ్‌రెడ్డి, ధర్మపురి నుంచి నిలబడ్డ కొప్పుల ఈశ్వర్, పాలకుర్తి నుంచి పోటీచేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, వనపర్తి నుంచి రంగంలో ఉన్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్‌కుమార్, మహబూబ్‌నగర్ వి.శ్రీనివాస్ గౌడ్ ఓటమి పాలయ్యారు. గత ఎన్నికల్లో 441 ఓట్లతో గట్టెక్కిన కొప్పుల ఈశ్వర్, ఈసారి మాత్రం ఓటమిని తప్పించుకోలేక పోయారని బీఆర్ఎస్ శ్రేణులు వ్యాఖ్యానించడం గమనార్హం.

తగ్గిన హరీశ్‌రావు మెజారిటీ

2018 శాసనసభ ఎన్నికల్లో 53 వేల ఓట్లతో విజయం సాధించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈసారి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. అలాగే 51 వేల ఓట్లతో గెలిచిన నిరంజన్‌రెడ్డి, ఈమారు కాంగ్రెస్ అభ్యర్థి టి మేఘారెడ్డి చేతిలో, ఇంతకుముందు 57 వేల ఓట్లతో విజయం సాధించిన శ్రీనివాస్‌గౌడ్ మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డిపై ఓడిపోయారు. ఇంతకుముందు మంత్రులుగా పనిచేసిన వారిలో కెటిఆర్, టి.హరీశ్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పి.సబితారెడ్డి, గంగుల కమలాకర్ మరోసారి గెలుపొందారు. తలసాని, సబిత మెజారిటీలు గతం కంటే మెరుగయ్యాయి. సబితారెడ్డికి గతంలో తొమ్మిది వేల ఓట్ల మెజారిటీ రాగా, ఇప్పుడు 26 వేలకు పెరిగింది. తలసానికి గతంలో 30 వేల ఆధిక్యం రాగా, ఇప్పుడు 41 వేలతో విజయం సాధించారు. సిద్ధిపేట నుంచి పోటీ చేసిన హరీశ్‌రావు మరోసారి సత్తా చాటారు. 2018లో ఆయనకు 1.18 లక్షల ఓట్ల మెజారిటీ రాగా, ఇప్పుడు 82 వేలకు తగ్గింది. సిరిసిల్ల నుంచి బరిలో ఉన్న కేటీఆర్‌కు గతంలో 89 వేలు రాగా, ఇప్పుడు 30 వేల మెజారిటీ మాత్రమే వచ్చింది. మేడ్చల్ మల్లారెడ్డికి గతంలో 89 వేలు రాగా, ఇప్పుడు 33 వేలు మాత్రమే దక్కింది. గంగుల కమలాకర్ ఇంతకుముందు 14వేల ఓట్ల మెజారిటీకి గాను, ఇప్పుడు కేవలం 300 ఓట్లతో బండి సంజయ్‌పై గెలుపొందారు. మిగతా మంత్రులకు సాధారణ మెజారిటీలు వచ్చాయి.

వారసులు.. కుటుంబ సభ్యుల గెలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అయితే ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి (అన్నా, తమ్ముళ్లు, మామా అల్లుళ్లు, భార్యా భర్తలు)పలువురు బరిలో నిలవగా కొందరు ఓటమి, మరికొందరిని గెలుపు వరించింది.

కోమటిరెడ్డి బ్రదర్స్..

అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ ఘన విజయం సాధించారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ తరపున వీరు పోటీ చేశారు.మునుగోడులో రాజగోపాల్ రెడ్డి 21వేల మెజార్టీతో గెలుపొందగా, ఆయన అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండలో 54వేలకు పైగా మెజార్టీతో భారీ విజయాన్ని అందుకున్నారు.

గడ్డం సోదరులు..

గడ్డం వినోద్, గడ్డం వివేక్ విజయం సాధించారు. వినోద్ బెల్లంపల్లి నియోజక వర్గం నుంచి ఆయన సోదరుడు వివేక్ చెన్నూ రు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున బరిలో దిగారు. ఇద్దరూ విజయం సాధించటం గమనార్హం.

భార్యాభర్తలు..

ఎన్నికల్లో భార్యభర్తలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పద్మావతి రెడ్డి భారీ విజయాన్ని అందుకున్నారు. హుజూర్ నగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గా బరిలోకి దిగిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి పోటీలో నిలిచిన ఆయన భార్య పద్మావతిరెడ్డి ఘన విజయం సాధించారు.

మామా అల్లుళ్లు..

మేడ్చల్ నియోజక వర్గం నుంచి మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి లో ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి బిఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందారు.

తండ్రీకొడుకులు

తండ్రీకొడుకులు సిఎం కెసిఆర్, కెటిఆర్ పోటీలో ఈ సారి కూడా ఉన్నారు. కెసిఆర్ గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీ చేయగా కామారెడ్డిలో ఓటమి చవిచూశారు. గజ్వేల్‌లో గెలుపొందారు. కుమారుడు కెటిఆర్ సిరిసిల్లలో బరిలో దిగి భారీ మెజారిటీతో గెలుపొందారు. మైనంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్ తరపున బరిలోకి దిగారు. మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన రోహిత్ గెలుపొందగా, మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసిన మైనంపల్లి హనుమంతరావు ఓటమి పాలయ్యారు.

ఓడిన బంధువులు..

వరంగల్ తూర్పు అసెంబ్లీ స్థానం నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్ బిజెపి తరపున పోటీలో నిలిచారు. ఆయన సోదరుడు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తి నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ తరపున బరిలో నిలిచారు. ఇద్దరూ ఓటమి పాలయ్యారు.

అత్త..అల్లుడు..

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బిఆర్ఎస్ తరపున బాల్కొండ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో ఉండగా..ఆయన మేనత్త అన్నపూర్ణమ్మ బిజెపి తరపున బరిలో నిలిచారు. చివరకు వేముల ప్రశాంత్‌రెడ్డి విజయం సాధించారు.

అధికారం లేకున్నా తెలంగాణకు సేవకులం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారంలో ఉన్నా.. లేకున్నా తాము తెలంగాణ సేవకులమన్నది మరిచిపోవద్దని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం "ఎక్స్"లో పోస్ట్ చేశారు. కష్టపడి పనిచేసినందుకు బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మన మాతృభూమి కోసం చిత్తశుద్ధితో పనిచేద్దామని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసిన సోషల్ మీడియా వారియర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. కోరుట్ల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గెలిచిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్సీ కవిత, కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలిపారు.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం.. :మంత్రి హరీశ్‌రావు

ప్రజాతీర్పును గౌరవిస్తున్నామంటూ, గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. రెండు సార్లు బిఆర్ఎస్ పార్టీకి అవకాశమిచ్చిన ప్రజలు ఈసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకొని పాలన సాగించాలని కోరారు. ఎన్నికల సమరంలో బిఆర్ఎస్‌కు మద్దతుగా శ్రమించిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

బిజెపి ఎంపిలకు షాక్.. కాంగ్రెస్ ఎంపిలు విన్

- దుబ్బాకలో బిఆర్ఎస్ నుంచి గెలిచిన మెదక్ ఎంపి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏడుగురు ఎంపిలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా నలుగురు గెలుపొందారు. ముగ్గురు ఓడిపోయారు. బిజెపి నుంచి బరిలో దిగిన కరీంనగర్ ఎంపి బండి సంజయ్, ఆదిలాబాద్ ఎంపి సోయం బాపూరావు, నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్‌కు గట్టి షాక్ తగిలింది. కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి బండి సంజయ్ కుమార్ పోటీ చేయగా ఆయన ప్రస్తుత మంత్రి గంగుల కమలాకర్ చేతిలో స్వల్ప ఓట్లతో పరాజితులయ్యారు. కోరుట్ల నుంచి ధర్మపురి అర్వింద్ పోటీ చేశారు. అక్కడ తొలిసారి బరిలోకి దిగిన కల్వకుంట్ల సంజయ్ చేతిలో అర్వింద్ ఓట్లతో ఓడిపోయారు. ఆదిలాబాద్ ఎంపిగా ఉన్న సోయం బాపూరావు బోథ్ స్థానం నుంచి బరిలోకి దిగి బిఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ చేతిలో ఘోరంగా ఓడిపోయారు. ఈ ముగ్గురూ గెలుస్తారని బిజెపి అధిష్టానం గంపెడాశలు పెట్టుకోగా నిరాశే మిగిలింది. కాంగ్రెస్ ఎంపిలు మాత్రం ఎమ్మెల్యేలుగా పోటీ చేసి విజయం సాధించారు. యాదాద్రి భువనగిరి ఎంపిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేశారు. అక్కడ బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డిపై వెంకట్‌రెడ్డి ఘనవిజయం సాధించారు. నల్లగొండ ఎంపిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగి సైదిరెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందారు. టిపిసిసి అధ్యక్షులు, మల్కాజిగిరి ఎంపి ఎ.రేవంత్‌రెడ్డి కొడంగల్, కామారెడ్డి నుంచి పోటీ చేశారు. కొడంగల్‌లో విజయం సాధించారు. కామారెడ్డిలో ఓడిపోయారు. మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి బిజెపి ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై ఘన విజయం సాధించారు.

కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లకు భంగపాటు

- కరీంనగర్ పార్లమెంటరీ స్థానం పరిధిలోనూ ఆశాభంగమే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఆ పార్టీకి చుక్కెదురైంది. అక్కడ నుంచి బరిలోకి దిగిన కృష్ణయాదవ్ ఘోరపరాజయం పాలయ్యారు. బిఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేతిలో 24,630 ఓట్ల భారీ తేడాతో ఓడిపోయారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ స్థానం పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, నాంపల్లి, సికింద్రాబాద్ అసెంబ్లీ స్థానాలుండగా.. బిజెపి ఒక్క చోట కూడా గెలవలేకపోయింది. లక్ష్మణ్ సొంత నియోజకవర్గమైన ముషీరాబాద్‌లో తాను సూచించిన పూసరాజు పరాజయం పాలయ్యారు. అర్వింద్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ పార్లమెంటరీ స్థానంలో ఆర్మూర్, నిజామాబాద్(అర్బన్) స్థానాల్లోనే బిజెపి అభ్యర్థులు గెలిచారు. బోధన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల స్థానాల్లో ఓడిపోయారు. సోయం బాపూరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం స్థానం పరిధిలో మాత్రం మెరుగైన ఫలితాలను సాధించింది. సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్ అసెంబ్లీ స్థానాల్లో అనూహ్యంగా బిజెపి అభ్యర్థులు విజయం సాధించారు.

అసిఫాబాద్(ఎస్టీ), ఖానాపూర్(ఎస్టీ), బోథ్(ఎస్టీ) స్థానాల్లో పరాజయం పాలైంది. ఆ నాలుగు ఎంపీ నియోజకవర్గాల స్థానాల పరిధిలో 28 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా..ఆరు స్థానాలను బిజెపి గెలుపొందింది.

సారు అంచనాలన్నీ తలకిందులైన వేళ..

- బిఆర్ఎస్ ఓటమికి కారణాలెన్నో...
- రివర్సయిన దళిత, బిసి, మైనారిటీ బంధులు
- కొంపముంచిన 'సిట్టింగులు'
- ప్రభుత్వ వ్యతిరేకతను పసిగట్టలేని దళపతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు...' అన్నట్టు ఇప్పుడు బిఆర్ఎస్ ఓటమికి కారణాలు ఎన్నో. 'అంతా తానే' అనుకోవడం, అతి విశ్వాసం.. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను పట్టించుకోకపోవడం.. ప్రతిపక్షాలను తక్కువగా అంచనా వేయడం... వెరసి కారు బొక్క బోర్లా పడింది. పదేండ్ల అధికారం తర్వాత సహజంగా ఏర్పడిన ప్రభుత్వ వ్యతిరేకతను గుర్తించడంలోనూ, గుర్తించినా జాగ్రత్త పడటంలోనూ ఆ పార్టీ పూర్తిగా విఫలమైంది. దాదాపు 40 మంది సిట్టింగులపై వ్యతిరేకత నెలకొన్నప్పటికీ, వారిని మారిస్తే అంతర్గత కుమ్ములాటలు, లేనిపోని తలనొప్పులు వస్తాయని భావించిన కెసిఆర్.. ఆ పని చేయలేకపోయారు. అన్ని పార్టీలకంటే ముందుగా 115 మంది అభ్యర్థులతో ఆగస్టు 21న తొలి జాబితాను ప్రకటించడం ద్వారా ప్రతిపక్షాలను డైలమాలో పడేయాలని ఆయన భావించారు. కానీ అది వర్కవుట్ కాలేదు. ఆగస్టు నుంచి నవంబరు వరకూ మధ్యలో అనేక చిత్ర విచిత్ర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. కీలక నేతలు కొందరు బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి జంపవగా.. మరికొందరు కాంగ్రెస్, బిజెపి లీడర్లు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. చివరి నిమిషంలో మహబూబ్‌నగర్ నుంచి రావుల చంద్రశేఖరరెడ్డి, నాగం జనార్థన్‌రెడ్డి, వరంగల్ నుంచి పొన్నాల లక్ష్మయ్య తదితరులను చేర్చుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

కెసిఆర్ ప్రతిష్టాత్మక పథకాల్లో ఒకటైన దళితబంధు కూడా బిఆర్ఎస్‌కు ప్రతికూల ఫలితాన్నిచ్చింది. వాస్తవానికి ప్రస్తుత ఎన్నికల్లో ఆ అస్త్రాన్ని సంధించాలని కెసిఆర్ నిర్ణయించారు. కానీ మధ్యలో హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారడంతో వ్యూహాత్మకంగా అప్పుడే దాన్ని ప్రకటించారు. కొద్ది మందికే ఆ పథకం వర్తింపజేయడంతో.. ఎక్కువ మందిలో వ్యతిరేకత కొనితెచ్చుకున్నారు. బిసి, మైనారిటీ బంధులు కూడా ఇదే తరహాలో వ్యతిరేకతను తెచ్చిపెట్టాయి. అర్హుల్లో ఎక్కువ మందికి డబుల్ బెడ్ రూం ఇళ్లు రాకపోవడం, కట్టిన వాటిని కూడా లబ్దిదారులకు పంపిణీ చేయకపోవడంతో ఆ పథకం గులాబీ పార్టీకి లబ్ది చేకూర్చకపోగా.. నష్టాన్ని మిగిల్చింది. 2014లో ప్రకటించిన దళితులకు మూడెకరాల భూ పంపిణీ అటకెక్కటంతో దానిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

నిరుద్యోగులు గుస్సా...

తెలంగాణ వచ్చిన నాటి నుంచి ఆశించిన స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకపోవటం యువతలో ఆగ్రహాన్ని తెప్పించింది. టిఎస్‌పిఎస్‌సి వేసిన నోటిఫికేషన్లు రద్దు కావడం, పరీక్షా పేపర్లు అనేకసార్లు లీకవటాన్ని నిరుద్యోగులు జీర్ణించుకోలేకపోయారు.

ఎమ్మెల్యేల వ్యవహారశైలి సైతం...

బిఆర్ఎస్ సిట్టింగు ఎమ్మెల్యేల్లో అనేక మంది వ్యవహారశైలిని ప్రజలు సహించలేకపోయారు. అవినీతి, అక్రమాలు, దందాలు వారిని ఇబ్బంది పెట్టాయి. అలాంటి బాధితులందరూ ఇప్పుడు బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా తమ ప్రతాపాన్ని చూపారు. సిఎం హోదాలో కెసిఆర్ ప్రజాదర్బారును నిర్వహించకపోవడం, ప్రజలను, ప్రతిపక్షాలను, ఆఖరికి సొంత పార్టీ నేతలకు కూడా అందుబాటులో ఉండకపోవడం, కీలక నేతలకు సైతం అపాయింట్‌మెంటు ఇవ్వకపోవడం లాంటి అంశాలను ప్రజలు గమనించారని చెప్పొచ్చు. ఆయా విషయాలపై వారు తమ తీర్పును ఇప్పుడు స్పష్టీకరించారు. పార్టీలో కుటుంబ ఆధిపత్యం మితిమీరిందన్న అభిప్రాయం కూడా సర్వత్రా నెలకొనటం నష్టం చేసింది. దీంతో 'సారు' అంచనాలన్నీ తలకిందులై బీఆర్ఎస్ ఓటమి పాలైంది.

హ్యాట్రిక్ వీరులు

- బిఆర్ఎస్ నుంచి 15, కాంగ్రెస్ నుంచి ఇద్దరు
- ఎంఐఎం నుంచి ముగ్గురు, బిజెపి నుంచి ఒకరు
- 20 మంది వరుసగా మూడోసారి విజయం
- డబుల్ హ్యాట్రిక్ కొట్టిన హరీశ్‌రావు, అక్బరుద్దీన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో 21 మంది అభ్యర్థులు హ్యాట్రిక్ కొట్టి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తోపాటు బిఆర్ఎస్ నుంచి 15 మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒకరు, ఎంఐఎం నుంచి ముగ్గురు మూడుసార్లు వరుస విజయాలు నమోదు చేసుకున్నారు. సిద్ధిపేట నుంచి హరీశ్‌రావు వరుసగా ఏడుసార్లు, చాంద్రాయణ గుట్ట నుంచి ఎంఐఎం నేత అక్బరుద్దీన్ వరుసగా ఆరు సార్లు విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్ కొట్టారు. ముఖ్యమంత్రి కెసిఆర్ 2014, 2018తోపాటు తాజాగా గెలిచి వరుస విజయాలను సాధించారు. 1985 నుంచి 2004 వరకు సిద్ధిపేట నుంచి ఆరుసార్లు గెలిచారు. ఇప్పటి వరకు 9 సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపిగా గెలిచి అరుదైన రికార్డును కెసిఆర్ తన ఖాతాలో వేసుకున్నారు. తాజాగా గజ్వేల్ నుంచి గెలిచిన ఆయన కామారెడ్డి నుంచి ఓటమి పాలయ్యారు. సిద్ధిపేట నుంచి మరో అరుదైన రికార్డును హరీశ్‌రావు సొంతం చేసుకున్నారు. 2004 నుంచి ఇప్పటి వరకు మొత్తం మూడు ఉప ఎన్నికలతో కలిపి ఏడుసార్లు విజయం సాధించారు. చాంద్రాయణ గుట్ట నుంచి ఎంఐఎంగా అభ్యర్థిగా ఆరు సార్లు గెలిచి అక్బరుద్దీన్ ఓవైసీ డబుల్ హ్యాట్రిక్ కొట్టారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి 2004 నుంచి బాన్సువాడ ఎమ్మెల్యేగా వరుసగా ఐదు సార్లు విజయం సాధించారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ 2014 నుంచి వరుస విజయాలను నమోదు చేసుకున్నారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్ నుంచి, బాల్కొండ నుంచి ప్రశాంత్ రెడ్డి, సిరిసిల్ల నుంచి కెటిఆర్, సూర్యాపేట నుంచి జగదీష్ రెడ్డి, కరీంనగర్ నుంచి గంగుల కమలాకర్‌లు హ్యాట్రిక్ కొట్టారు. శేరిలింగంపల్లి నుంచి అరికెపుడి గాంధీ, రాజేంద్రనగర్ నుంచి ప్రకాష్ గౌడ్, జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపినాథ్, కుత్బుల్లాపూర్ నుంచి కెపి వివేకానంద, కూకట్‌పల్లి నుంచి మాధవరం క్రిష్ణారావు 2014లో టిడిపి నుంచి, 2018 తోపాటు ప్రస్తుత ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి మల్లు బట్టి విక్రమార్క మధిర నుంచి నాలుగుసార్లు, ములుగు నుంచి సీతక్క మూడుసార్లు గెలిచి హాట్రిక్ కొట్టారు. మలక్‌పేట నుంచి అహ్మద్ బలాల, కార్వాన్ నుంచి కౌసర్ మొహియొద్దీన్‌లు ఎంఐఎం నుంచి వరుస విజయాలను సాధించారు. బిజెపి నుంచి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ 2014 నుంచి మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించాడు.

సిఆర్‌ఎఫ్ ఆధీనంలో నాగార్జున డ్యామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యామ్‌ను సిఆర్‌పిఎఫ్ బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. డ్యాంపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా వేసిన కంచెను, భారికేడ్లను ఆదివారం ఉదయం తొలగించారు. కుడి కాలువకు నీటి విడుదలనూ బంద్ చేశారు. సిఆర్‌పిఎఫ్ బలగాల రాకతో తెలంగాణ పోలీసులు శనివారమే డ్యామ్ నుంచి వెనుదిరిగారు. ఎపి పోలీసులు ఆదివారం ఉదయం వరకు డ్యామ్‌పై పహారా కాశారు. దీంతో ఆంధ్ర, తెలంగాణ వైపు నుంచి కేంద్ర బలగాలు డ్యామ్‌పైకి చేరుకొని ఆంధ్ర పోలీసులు వేసిన కంచెను, భారీకేడ్లను తీసివేయాల్సిందిగా కోరారు. 6వ తేదీ వరకు డ్యామ్ కేంద్ర బలగాల ఆధీనంలోనే ఉండనుందని, డ్యామ్ వదిలి వెళ్లిపోవాలని తెలంగాణ వైపు అసిస్టెంట్ కమాండెంట్ షరీఫ్ అలీ, ఆంధ్ర వైపు అసిస్టెంట్ కమాండెంట్ కుల్దీప్ సూచించారు. దీంతో ఆంధ్ర పోలీసులు డ్యామ్ వదిలి వెళ్లిపోయారు. శనివారం అర్ధరాత్రి నాగార్జునసాగర్ కుడికాలువకు నీటిని నిలుపుదల చేశారు. గతంలో సాగర్ డ్యామ్‌కు భద్రత కల్పించిన ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్స్ తెలంగాణ వైపు ఉన్న ఎర్త్ డ్యామ్, మెయిన్ గేట్ వరకే పరిమితం కానున్నారు. కేంద్ర బలగాలతో పాటు ఎన్‌ఎస్‌పి ఎస్‌ఇ నాగేశ్వరావు, ఇఇ మల్లికార్జున, డిఇ శ్రీనివాస్, ఎఇ కృష్ణయ్య ఉన్నారు.

అభ్యర్థుల మార్పుతో కొంత పరువు దక్కింది..

- అదిలేకే అనేకచోట్ల భారీ మూల్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన బిఆర్ఎస్ చివరిక్షణంలో తీసుకున్న నిర్ణయాలు ఆ పార్టీ పరువు కొంతమేర కాపాడాయి. ఎన్నికలకు దాదాపు నాలుగు నెలల ముందే బిఆర్ఎస్ అభ్యర్థులను కెసిఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అక్కడక్కడా తలెత్తిన అసంతృప్త గళాలను సర్దుబాటుచేసే ప్రయత్నం చేశారు. కాగా దాదాపు సిట్టింగ్ ఎమ్మెల్యేలు అందరికి టకెట్లు ఇస్తామంటూ తొలుత ప్రకటించిన కెసిఆర్, ఆ తర్వాత నిర్ణయాలను మార్చుకోవాల్సి వచ్చింది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చారు. సుమారు పది నియోజకవర్గాల్లో ఈ తరహా మార్పులు చేపట్టారు. ఇందులో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గతంలో రాజయ్య ఎమ్మెల్యేగా ఉండేవారు. కాగా అక్కడి నుంచి కడియం శ్రీహరి పోటీపడటంతో తాటికొండ రాజయ్యను మార్చారు. అక్కడి నుంచి కడియం మరోసారి అసెంబ్లీకి వస్తున్నారు. అలాగే జనగామలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి స్థానంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. జోగులాంబ-గద్వాల జిల్లాలోని ఆలంపూర్ అభ్యర్థి ఆబ్రహంను మార్చేసి విజయుడికి టికెట్ ఇవ్వడంతో ఆయన గెలుపొందారు. నర్సాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి వ్యతిరేకత పెరిగిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో ఇక్కడా విజయం సాధించారు. కోరుట్లలో కల్వకుంట్ల విద్యాసాగర్ స్థానంలో ఆయన కుమారుడు, డాక్టర్ అయిన కల్వకుంట్ల సంజయ్‌ను కొత్త అభ్యర్థిగా బరిలోకి దింపి గెలిపించారు. ఆసిఫాబాద్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుపై స్థానిక పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో ఆయన స్థానంలో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జడ్‌పి చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి టిక్కెట్ ఇవ్వడంతో ఆమె విజయతీరాలకు చేరారు. మెదక్ జిల్లాలో దుబ్బాక నుంచి ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అవకాశం ఇవ్వడంతో ఆయన గెలుపొందారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కత్తిపోటుకు గురవడంతో ఆయనపై సానుభూతి పెరిగి గెలుపు సులువైంది. బోథ్‌లో రాథోడ్ బాబూరావుకు బదులు అనిల్‌జాదవ్‌కు అవకాశం ఇవ్వడంతో అక్కడా విజయం దక్కింది. గ్రేటర్ హైదరాబాద్‌లో పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డికి టికెట్ నిరాకరించారు. ఆయన స్థానంలో బండారి లక్ష్మారెడ్డి అవకాశం ఇవ్వడంతో అక్కడా బిఆర్ఎస్‌కు స్థానిక ఓటర్లు పట్టం కట్టారు. మల్కాజ్‌గిరిలో మైనంపల్లి హనుమంతరావు సీటు కేటాయించినా, ఆయన రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంతో మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో అక్కడా గెలుపు సాధ్యమైంది. కాగా రెండు చోట్ల మాత్రం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వ్యూహం ఫలించలేదు. ఖానాపూర్‌లో రేఖానాయక్ స్థానంలో జాన్సన్ నాయక్, వేములవాడలో ప్రొఫెసర్ రమేష్‌బాబు స్థానంలో చల్మెడ లక్ష్మి నర్సింహారావుకు సీట్లు కేటాయించగా అక్కడ ప్రత్యర్థులు గెలుపొందారు. కొన్ని చోట్ల స్థానిక పార్టీ శ్రేణుల ఫిర్యాదుల మేరకు అభ్యర్థులను మార్చగా, మరికొన్ని చోట్ల ఇంటెలిజెన్స్ నివేదిక ఆధారంగా తొలగించారు. ఇదిలావుండగా ఇదే నిఘా వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా 45 మంది అభ్యర్థులను మార్చేసి కొత్త వాళ్లను పెడితే విజయావకాశాలు మరింత మెరుగ్గా ఉంటాయని సూచించింది. అప్పటికే సమయం మించిపోవడంతో అభ్యర్థులను మార్చేందుకు కెసిఆర్ సాహసించలేదు. ఆ నిర్ణయమే ఇప్పుడు బీఆర్ఎస్ కొంపముంచిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ హవా

- ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఏడు, బిఆర్ఎస్ ఐదు చోట్ల విజయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి, వికారాబాద్, కొడంగల్, తాండూర్, పరిగి స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, ఎల్‌బీనగర్ స్థానాల్లో బిఆర్ఎస్ విజయం సాధించింది. ఇబ్రహీంపట్నంలో 15 ఏళ్లుగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విజయం సాధిస్తూ వచ్చారు. ఈసారి మాత్రం ఇక్కడ మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం సాధించారు. షాద్‌నగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ విజయం సాధించారు. కల్వకుర్తిలో బిజెపి అభ్యర్థి ఆచారిపై కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికల ముందు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆ వెంటనే టికెట్ దక్కించుకుని స్థానిక ఎమ్మెల్యేపై కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించారు. ఇక్కడ బిఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఎల్‌బినగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మరోసారి విజయం సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ ఇక్కడ కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపి మధుయాష్కి పోటీ చేసి ఓడిపోయారు. మహేశ్వరంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి మరోసారి విజయం సాధించారు. బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములుపై సబితా గెలుపొందారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ఆర్ మూడో స్థానానికి పరిమితమయ్యారు. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్లలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికపూడి గాంధీ, కాలె యాదయ్య మళ్లీ విజయం సాధించారు. అయితే చేవెళ్లలో మాత్రం కాలె యాదయ్య స్వల్ప ఓట్లతో గెలిచారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి బీం భారత్ రీకౌంటింగ్ చేయాలని డిమాండ్ చేశారు.

వికారాబాద్‌లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ 7, బిఆర్ఎస్ 5 చోట్ల విజయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ తన హవా చాటుకుంది. గతంలో ఇక్కడ బలంగా ఉన్న కాంగ్రెస్ మళ్లీ పూర్వ వైభవాన్ని సంపాదించింది. జిల్లాలో మొత్తం 12 స్థానాలు ఉంటే కాంగ్రెస్ ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. ఐదు చోట్ల బిఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. వికారాబాద్ జిల్లాలోని నాలుగు చోట్ల కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. గతంలో తాండూర్ తప్పా.. మిగిలినవి బిఆర్ఎస్ సిట్టింగ్ సీట్లు కావడం విశేషం.

ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి, వికారాబాద్, కొడంగల్, తాండూర్, పరిగి స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, ఎల్‌బీనగర్ స్థానాల్లో బిఆర్ఎస్ విజయం సాధించింది. ఇబ్రహీంపట్నంలో 15 ఏండ్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విజయం సాధిస్తూ వచ్చారు. ఈసారి మాత్రం ఇక్కడ మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం సాధించారు. షాద్‌నగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ విజయం సాధించారు.

కల్వకుర్తిలో బిజెపి అభ్యర్థి ఆచారిపై కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికల ముందు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆ వెంటనే టికెట్ దక్కించుకుని విజయం సాధించారు. ఇక్కడ బిఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఎల్‌బీనగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మరోసారి విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపి మధుయాష్కి పోటీ చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ ఓడిపోయారు. మహేశ్వరంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మరోసారి విజయం సాధించారు. బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములుపై మంత్రి గెలుపొందారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ఆర్ మూడో స్థానానికి పరిమితమయ్యారు. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్లలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికపూడి గాంధీ, కాలె యాదయ్య మళ్లీ విజయం సాధించారు. అయితే చేవెళ్లలో మాత్రం కాలె యాదయ్య స్వల్ప ఓట్లతో గెలిచారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి బీం భారత్ రీకౌంటింగ్ చేయాలని డిమాండ్ చేశారు.

కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి విజయం

కొడంగల్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సుమారు 32 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. వికారాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌పై మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ విజయం సాధించారు. పరిగిలో బిఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిపై కాంగ్రెస్ నేత రామ్మోహన్‌రెడ్డి గెలుపొందారు. తాండూర్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి విజయం సాధించారు. ఇక్కడ గతంలో రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచి అనంతరం బిఆర్ఎస్‌లో చేరారు. ఎన్నికల ముందు డిసిసిబి చైర్మన్‌గా ఉన్న మనోహర్‌రెడ్డి బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి తాండూర్ నుంచి గెలుపొందారు. వికారాబాద్ జిల్లాలో మూడు సిట్టింగ్ స్థానాలను బీఆర్ఎస్ కోల్పోయింది. మొత్తానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పూర్వ వైభవం సాధించగా.. బీఆర్ఎస్ తన ఊనికిని చాటుకుంది.

'కారు' ఫల్టీ కొట్టిన వేళ..

- బోసిపోయిన తెలంగాణ భవన్...
- ఒక్కరంటే ఒక్క నేతా కనపడని వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'విజయానికి అందరూ బంధువులే.. అపజయమే అనాథ...' ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌ను చూసిన వారికి ఇదే కొటేషన్ గుర్తొచ్చింది. నిన్నటిదాకా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధుల రాకపోకలతో కళకళలాడిన ఆ భవన్ పూర్తిగా బోసిపోయింది. ఒక్కరంటే ఒక్క నాయకుడూ అటువైపు రాకపోవడం గమనార్హం. మొన్నటిదాకా కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు తదితర అగ్రనేతలు వచ్చినప్పుడు పోలీసులు, బారికేడ్లు, మందీ మార్బలంతో హడావుడిగా, అంతకు మించిన హంగామాతో కనిపించే ఆ పరిసర ప్రాంతాల్లో నిశ్శబ్దం రాజ్యమేలింది. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు, వివిధ ఎన్నికల్లో గెలిచిన సందర్భాల్లో కార్యకర్తలు, లీడర్లు అక్కడ చేసే హంగామా అంతా ఇంతా కాదు. బాణాసంచా పేలుళ్లతో ఆ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ దద్దరిల్లేవి. ముఖ్యంగా కెసిఆర్ అక్కడకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరేవి. దాదాపు అరగంట, గంట వరకూ ట్రాఫిక్ క్లియర్ అయ్యేది కాదు. కానీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆదివారం తెలంగాణ భవన్ చుట్టూ అందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది. కార్లు లేవు.. పోలీసులు లేరు..ఎలాంటి హంగామా లేదు. కొద్ది మంది జర్నలిస్టులు తప్ప బీఆర్ఎస్ క్యాడర్ గానీ, లీడర్ గానీ అక్కడ కనపడకపోవటం గమనార్హం.

బిఆర్ఎస్‌కు నిరుద్యోగుల వాత

- ఎన్నికల్లో హామీ ఇచ్చినా అమలు కాని 'భృతి'
- ఉద్యోగాల భర్తీని పట్టించుకోని ప్రభుత్వం
- టిఎస్‌పిఎస్‌సి తీరుపై అసంతృప్తి
- ప్రశ్నాపత్రాల లీకేజీతో ఇబ్బందులు
- కాంగ్రెస్‌వైపు మొగ్గిన యువత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఒక్కొక్కరికీ నెలకు రూ.3,016 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం' అంటూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చారు. ఆ పార్టీ మేనిఫెస్టోలోనూ ప్రకటించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఐదేండ్లలోనూ నిరుద్యోగ భృతిని బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదు. దీంతో నిరుద్యోగుల్లో ఈ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయితే ఈ ఎన్నికల సందర్భంగానైనా నిరుద్యోగుల కోసం బిఆర్ఎస్ మేనిఫెస్టోలో ఏదో ఒక హామీ ఇస్తారని ఆశించారు. అందులోనూ వారి ఊసే ఎత్తలేదు. నిరుద్యోగులు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలనే ప్రస్తావించలేదు. దీంతో బిఆర్ఎస్ తీరు పట్ల నిరుద్యోగులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ మోసం చేసిందన్న అభిప్రాయానికి వచ్చారు. అదును కోసం ఎదురుచూసిన నిరుద్యోగులు ఈ ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకున్నారు. కాంగ్రెస్‌కు అండగా నిలిచి బిఆర్ఎస్‌ను ఓడించడంలో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ గెలిచిన అన్ని నియోజకవర్గాల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. బీఆర్ఎస్‌ను ఓడించాలంటూ ఓయూ జేఏసీ నేతలు, యువజన సంఘాలు గ్రామగ్రామాన తిరిగి ప్రచారం చేశాయి. జాగో తెలంగాణ పేరుతో నిరుద్యోగ చైతన్య బస్సుయాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఇచ్చే డబ్బు, మద్యానికి ఓటు వేస్తే తమ జీవితాలు ఆగమవుతున్నాయని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇది ప్రజలను ఆలోచింపచేసింది. అందుకే అటు నిరుద్యోగులు, ఇటు ఉద్యోగులు, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు సైతం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు ఓటేశారు. అందుకే అధికార పార్టీ ఓటమిని చవిచూసింది.

కొలువులు రాక మానసిక వేదన

నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదం పేరుతో తెలంగాణ ఉద్యమం సాగింది. ప్రత్యేక రాష్ట్రం వస్తే అందరికీ ఉద్యోగాలు వస్తాయని యువకులు ఆ ఉద్యమంల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎంతో మంది ఆత్మబలిదానాలు చేశారు. తెలంగాణ వచ్చినా బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయమే తెలంగాణలోనూ జరిగిందన్న అభిప్రాయానికి నిరుద్యోగులొచ్చారు. ఇంకోవైపు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వ్యవహరించిన తీరు నిరుద్యోగుల్లో ఆగ్రహానికి కారణంగా ఉన్నది.

ప్రశ్నాపత్రాల లీకేజీ, రాతపరీక్షలు రద్దు కావడం, వాయిదా పడడం వంటి కారణాలతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా మొదటిసారి, హైకోర్టు ఆదేశాలతో రెండోసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను కూడా టీఎస్‌పీఎస్సీ, ఎన్నికల కారణంగా డీఎస్సీ రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేశాయి. దీంతో జీవితాలు నాశనమయ్యాయన్న అభిప్రాయానికి నిరుద్యోగులు బలంగా వచ్చారు. ఒకవైపు విలువైన సమయం, ఇంకోవైపు డబ్బు వృధా అయ్యాయన్న మానసిక ఆవేదనకు వచ్చారు. ఎన్నికల్లో నిరుద్యోగుల అంశం కీలకంగా పనిచేసింది. అధికారంలోకి వస్తే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ప్రకటించారు. ఇంకోవైపు పరీక్షలు వాయిదా పడడంతో మనస్థాపానికి గురైన ప్రవళిక ఆత్మహత్య సంచలనమైంది. ప్రేమకారణంతోనే ఆత్మహత్యకు పాల్పడిందనీ, గ్రూప్స్ పరీక్షలకు దరఖాస్తు చేయలేదంటూ మంత్రి కేటీఆర్ ప్రకటించి అభాసుపాలయ్యారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తామని హామీ ఇచ్చింది. అందుకే నిరుద్యోగులు ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపులో కీలక భూమిక పోషించారు.